

ఐస్‌క్రీం కేంద్రాల్లో తనిఖీలు

అనుమతి లేని రెండు ఐస్‌క్రీం తయారీ కేంద్రాలను తాండూరు మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 8లో▸



యథేచ్ఛగా అక్రమ దందాలు

అక్రమ దందాలకు ధారూరు అడ్డాగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా మట్టి, ఇసుక, కలపను తరలించి జేబులు నింపుకుంటున్నారు. 8లో▸



ఏకమైతేనే రాజ్యాధికారం

బహుజనులంతా ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ మండల అధ్యక్షుడు సయ్యద్ బాబా అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



కేరెళ్లి మత్స్య సహకార సంఘం సభ్యులు

ధారూరు: మండల పరిధిలోని కేరెళ్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజ్మత్‌పాష ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా కొకలి లాలయ్య, ఉపాధ్యక్షుడిగా గొర్రెంక నాగన్న, ప్రధాన కార్యదర్శిగా చింతకింది రాములుతో పాటు డైరెక్టర్లుగా యాదగిరి, రాజు, నర్సింహులు, శ్రీనివాస్, రాములు, బాల్‌రాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అజ్మత్‌పాష తెలిపారు. ఎన్నికైన వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



పాతకొడంగల్ తండాలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

కొడంగల్ రూరల్ : అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఏఈఓ రాజునాయక్ పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్, తండా, అయినన్‌పల్లి తదితర గ్రామాల్లో ఉల్లి, వరి, మొక్కజొన్న, జొన్న పంటలను పరిశీలించారు. చేతికొచ్చిన పంట వర్షార్పణంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, రైతులు రాజశేఖర్, గోపాల్‌నాయక్, హన్మ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసేవరకు సమ్మె విరమించం



ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

బషీరాబాద్: తమను రెగ్యులర్ చేసే వరకు సమ్మె విరమించబోమని జేపీఎస్‌లు తేల్చిచెప్పారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న సమ్మె మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. హరితహారంలో చేసిన కష్టాన్ని ముగ్గుల రూపంలో తెలిపారు. తమ సమ్మెకు రాజకీయ పార్టీలతో పాటు సర్పంచులు మద్దతు తెలుపుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మరోవైపు జేపీఎస్‌ల సమ్మెకు కంప్యూటర్ ఆపరేటర్లు మద్దతు తెలిపారు. జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

చిన్నారుల స్థితిగతులు తెలుసుకోండి



బాలల సంరక్షణపై మాట్లాడుతున్న లలితకుమారి

వికారాబాద్ అర్బన్: చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఉండి వేసవి సెలవుల నిమిత్తం ఇంటికి వెళ్లిన చిన్నారుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి తెలిపారు. మంగళవారం శిశు సంక్షేమ శాఖ, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ, పట్టణ స్థాయిలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్దకు వెళ్లి అక్కడి మత పెద్దలను కలిసి బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను పటిష్టం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటేశ్, బాలల సంక్షేమ వసతి సభ్యులు ప్రకాశ్, సంగమేశ్వర్, సబిత తదితరులు పాల్గొన్నారు.

'మొక్క'వోని లక్ష్యం!

ఎనిమిదో విడత హరితహారం కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈసారి సుమారు అరకోటి మొక్కలను నాటేలా చర్యలు చేపడుతున్నారు. వానాకాలం ప్రారంభలోనే కార్యక్రమం ప్రారంభించేందుకు 19 శాఖలను భాగస్వాములను చేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 581 నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు.

ఎనిమిదో విడత హరితహారానికి సర్వం సిద్ధం

- సుమారు అరకోటి మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- పలు ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు
- 566 జీపీ, 15 ఫారెస్టు నర్సరీలలో పెంచుతున్న మొక్కలు



పరిగి మండలం బసిరెడ్డిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎనిమిదో విడత హరితహారం కార్యక్రమానికి అధికార యంత్రాంగం లక్ష్యాలను నిర్దేశించింది. వర్షాకాలం సమీపిస్తుండటంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 19 ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసి శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించారు. అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో హరితహారం కార్యక్రమాన్ని రూపకల్పన చేస్తున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈసారి జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ఈ ఏడాది 40,54000 మొక్కలు..

జిల్లాలో ఈ ఏడాది 40,54000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత సంవత్సరం 38,70,705 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా 28,34,785 మొక్కలే నాటారు. అందులో 80శాతం వరకు మొక్కలు బతికాయని చెబుతున్నా వాస్తవానికి 50 నుంచి 60 శాతం మాత్రమే మొక్కలు సంరక్షణ జరిగాయని క్షేత్ర స్థాయి పరిశీలనలో తెలుస్తోంది. ఈసారి నాటిన మొక్కల్లో 80 శాతానికిపైగా సంరక్షించే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో ఖాళీ స్థలాలలో, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, రోడ్డు పక్కన, బంజరు భూముల్లో, పొలం గట్లవద్ద.. ఇలా అవకాశమున్న ప్రతిచోటా మొక్కలను నాటేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు.

581 నర్సరీల్లో..

జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మొత్తం 581 నర్సరీలలో మొక్కలను పెంచుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 15, గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 566 గ్రామ పంచాయతీల్లో నర్సరీలున్నాయి. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఒక్కో నర్సరీలో 5వేల చొప్పున 28,30000 మొక్కలు, 15 ఫారెస్టు నర్సరీల్లో కలిపి 10 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఫారెస్ట్ పీసెస్ అంటే.. గచ్చకాయ, వెదురు, గుల్‌మోర్, రేన్‌ట్రీ, రావి, మర్రి, కానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్కలు, దానిమ్మ, నిమ్మ, గోరింటాకు, తదితర మొక్కలను పేర్కొంటారు. అదే విధంగా హోంసీడ్ మొక్కలు అంటే (ఇళ్ల వద్ద నాటుకునేవి) పూలు, పండ్ల మొక్కలను పేర్కొంటారు. ఈ మొక్కలను ఇంటివద్ద నాటుకునేవారికి వీటిని అందజేస్తారు. అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామ పంచాయతీలకు 25లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యం నిర్దేశించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 5లక్షలు, విద్యాశాఖ 11 వేలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ 9లక్షలు 43,500, ఉద్యానవన శాఖకు 2,లక్షలు , వ్యవసాయ శాఖకు 5 లక్షలు, తాండూరు మున్సిపాలిటీకి 70 వేలు, వికారాబాద్ మున్సిపాలిటీకి 80 వేలు, కొడంగల్ మున్సిపాలిటీకి 35 వేలు, పరిగి మున్సిపాలిటీకి 30 వేలు ఇలా 19 ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు.

మొక్కలు సిద్ధం



హరితహారం కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సన్నద్ధులమవుతున్నాం. జిల్లాలో అటవీశాఖ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలోని నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. సీఎం కేసీఆర్ వర్షాకాలం ఆరంభంలోనే 8వ విడత హరితహారం కార్యక్రమం ప్రారంభించే విధంగా అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆదేశించారు. కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. టేకుతో పాటు పలు రకాల మొక్కలు కూడా నర్సరీలలో ఉన్నాయి. శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించటం కూడా పూర్తయ్యింది.

– కృష్ణన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

సమన్వయంతో పనిచేయండి

- పనులు సకాలంలో పూర్తిచేయాలి
- ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం పలు అభివృద్ధి కార్యాక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అత్యవసరమైన పనులను ముందుగా పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, మురుగు కాలువలు వంటి పనులు ఈనెల 15లోపు పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా చేసే నల్లాలకు తప్పనిసరిగా ఫ్లో కంట్రోల్ వాల్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడతల గొర్రెల పంపిణీ కి డాక్యుమెంటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డీపీఓ తరుణ్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

పరిగి: ప్లాటింగ్ లేఅవుట్లను ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని న్యామత్‌నగర్‌లో చేపట్టిన లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా లేఅవుట్లను చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా వెలిసిన లేఅవుట్లను తొలగిస్తామని హెచ్చరించారు. నిబంధనాల మేరకు ఉంటేనే అనుమతులను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. హరితహార కార్యక్రమానికి నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామంలోని ప్రతి రోజు సేకరించే చెత్తను కంపోస్ట్ షెడ్డులో కంపోస్టును తయారు చేయాలన్నారు. బసిరెడ్డిపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించి నర్సరీలో మొక్కలు చాలా బాగున్నాయని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, ఎంపీఓ దయానంద్, ఏపీఓ ఉష,ఈసీ ప్రభాకర్, బసిరెడ్డిపల్లి సర్పంచ్ సూరప్ప పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని వీఓఏల నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

అనంతగిరి: విలేజీ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల (వీఓఏ) కనీస వేతనాలు రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వీఓఏల సంఘం అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి ప్రభు, మల్లేశం, దేవయ్య, పుల్లయ్య, సురేఖ, లక్ష్మి, లావణ్య, మహేందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- రైల్వే అధికారులను కలిసిన ఎంపీ రంజిత్‌రెడ్డి



రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

చేవెళ్ల:రైల్వేశాఖ పరిధిలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి. రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే భవన్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరికేపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌లతో వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పిల్లోనిగూడ–పాలమాకుల మధ్య రైల్వే గేట్‌ను మూడు నెలలుగా మూసివేశారని, దీంతో పిల్లోనిగూడ, మక్తగూడ, గూడూరు, అచ్చంపేట, నవాజీపూర్, బోటిగూడ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాదాపూర్–హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ చుట్టు పక్కల డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ట్రాక్ కింద నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కోసం అనుమతించాలన్నారు. బీదర్- హైదరాబాద్ ఇంటర్ సిటీ ట్రెన్ వికారాబాద్‌లోని మర్పల్లి వద్ద ఆపాలని కోరారు. చేవెళ్లపార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

మతసామరస్యానికి తాండూరు ప్రతీక

- ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- హోం మంత్రి మహమూద్‌అలీ
- ఈద్ మిలాప్ కార్యక్రమానికి హాజరు



హోంమంత్రి మహమూద్‌అలీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధి, చిత్రంలో ఎమ్మెల్యే

తాండూరు: మత సామరస్యానికి తాండూరు ప్రాంతం ప్రతీకగా నిలుస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మంగళవారం రాత్రి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి హోంశాఖ మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. తాండూరు పట్టణంలో ఈద్ మిలాప్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముస్లింలకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులున్నారు.

సరిహద్దుల్లో నిఘా ముమ్మరం



కస్తూరుపల్లి శివారులోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఎస్పీ కోటిరెడ్డి తనిఖీలు

- జిల్లాలో ఆరు చెక్ పోస్టుల ఏర్పాటు
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- శాంతిభద్రతలకే అధిక ప్రాధాన్యం
- ఎస్పీ కోటిరెడ్డి వెల్లడి

కొడంగల్: జిల్లా పరిధిలో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా ముమ్మరం చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లి శివారులో ఉన్న చెక్ పోస్టును సందర్శించారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్రం సరిహద్దు వరకు వెళ్లి పరిశీలించారు. ఇక్కడి నుంచి కర్నాటక రాష్ట్రానికి వెళ్లే వాహనాలను తనిఖీ చేయాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని కొడంగల్, దౌల్తాబాద్, బషీరాబాద్ మండలాల్లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొడంగల్ మండలంలోని రావులపల్లి, దౌల్తాబాద్ మండలం చంద్రకల్ శివారులో, బషీరా బాద్ మండలం నవంద్గి, మైల్వార్, ఇందర్‌చేడ్, కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తాపూర్ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఈవిషయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు సరిహద్దులు దాటి వెళ్లరాదన్నారు.జిల్లాలో ప్రమాదాలు తగ్గినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. హెల్మెటు లేకుండా దిచక్ర వాహనాలను నడిపితే వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో ఉంచుతామని, హెల్మెట్ తీసుకొచ్చి వాహనాలను తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శంకర్, ఎస్ఐ రవిగౌడ్ పాల్గొన్నారు.

ఇక్కడే పుట్టా.. ఇక్కడే చస్తా

- మీ బిడ్డగా ఆశీర్వదించండి
- తాండూరు రూపు రేఖలు మారుస్తా
- 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపించా
- 25 ఏళ్లు ఏలిన ఆ మరుగుజ్జు మనిషిని నమ్మకండి
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఫలాలతో తులాభారం వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూరు టౌన్ : 'నన్ను మీ బిడ్డగా భావించి ఆశీర్వదించండి.. ఇక్కడే పుట్టా.. ఇక్కడే చస్తా.. 40 ఏళ్లుగా జరగని అభివృద్ధి నాలుగేళ్లలోనే చేసి చూపించా'నని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు పరుస్తున్నానన్నారు. ఓ మరుగుజ్జు మనిషి తాండూరు నాదే అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడని, నాన్‌లోకల్ అయిన అతన్ని ఇక్కడి నుంచి తరిమికొట్టాలని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

అన్ని గ్రామాలకు నిధులు

నియోజవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరిగిందని, త్వరలోనే పనులను పూర్తి చేస్తామన్నారు. అలాగే తాండూరు పట్టణంలో వార్డుకు రూ. కోటి చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు. పాత తాండూరు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించి నాలుగు నెలల్లోగా పూర్తి చేస్తామన్నారు. రూ.25 కోట్లతో తాండూరులో నర్సింగ్ కాళాశాలను మంజూరు చేయించానన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఐటీఐ కళాశాల ప్రారంభమవుతుందన్నారు. తాండూరు చుట్టూ నిర్మించనున్న రింగ్ రోడ్డు పనుల్లో రాజీవ్ కాలనీ వైపు బైపాస్ రోడ్డు పూర్తి కానున్నదని అన్నారు. కాలుష్య నివారణ కోసం జినుగుర్తి దగ్గరలో 313 ఎకరాల్లో పారిశ్రామిక వాడను ఏర్పాటుచేసి, కాలుష్యాన్ని తాండూరు ప్రజల నుంచి దూరం చేస్తానన్నారు. ఆటో నగర్, లారీ పార్కింగ్ నిర్మాణాలు కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

నన్ను ఎవరూ కొనలేరు..

నన్ను ఎవరూ కొనలేరని, నా బతుకంతా తాండూరు ప్రజల కోసమేనని అన్నారు. సీఎం కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శనీయమని కొనియాడారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. పలు రకాల ఫలాలతో తులాభారం వేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్, పార్టీ పట్టణాధ్యక్షులు నయీమ్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

3 డీలక్స్ బస్సు సర్వీసులు ప్రారంభం

తాండూరు నుంచి హైదరాబాద్ నడిపేందుకు కొత్తగా మూడు డీలక్స్ బస్సులను పచ్చ జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. స్వయంగా బస్సు నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. హైదరాబాద్‌కు తొలి టికెట్‌ను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎం సమత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఫిజియోథెరపీ సెంటర్

స్థానిక జిల్లా ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య కేంద్రంతో పాటు వయోవృద్ధుల కోసం ఫిజియోథెరపి సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్, వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్‌పోస్ట్ వద్ద ఎస్పీ తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు రూరల్: తెలంగాణ – కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కోత్లాపూర్ చెక్ పోస్ట్ వద్ద ఎస్పీ కోటిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకలో ఈ నెల 10న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో కోత్లాపూర్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా నగదు, మద్యం తరలిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. డబ్బు తీసుకెళ్లే వాళ్లు తప్పని సరిగా రసీదులు చూపించాలన్నారు. తనిఖీలో తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

నిందితుడికి జీవితఖైదు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన యువతిపై అఘాయిత్యం చేసిన ఘటనలో నిందితుడికి జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి సుదర్శన్ మంగళవారం జీవిత ఖైదు విధించినట్లు ఎస్పీ కోటిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో నిందితుడిని జైలుకు తరలించారు. బాధితురాలికి పరిహారం కింద రూ. 6లక్షలు మంజూరైంది. కేసు దర్యాప్తులో పాలుపంచుకున్న పోలీసు అధికారులు అశోక్ కుమార్, శ్రీనివాస్, కరుణాసాగర్‌రెడ్డి, రవిగౌడ్, సురేష్‌గౌడ్, వీరన్న, హాషామ్, నిరంజన్‌గౌడ్, స్నేహలత, స్రవంతిని ఎస్పీ అభినందించారు.

ఆర్థిక సాయం



ముస్లిం ప్రతినిధులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

తాండూరు: తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంసెట్ కోచింగ్ సెంటర్‌కు ఎంపీ రంజిత్‌రెడ్డి చేయూత అందించారు. బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, నాయకులు మసూద్ ఎంసెట్ ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ రంజిత్‌రెడ్డి తన వంతుగా రూ. 1.50 లక్షలు అందజేశారు. మంగళవారం ఇందుకు సంబంధించిన మొత్తాన్ని అసోషియేషన్ అధ్యక్షుడు కమల్ అతార్, ప్రధాన కార్యదర్శి ఖాలీద్‌కు అందజేశారు.

కారు ఢీకొని గేదెల మృతి



దోమ: కారు ఢీకొని రెండు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఊటుపల్లి అటవీ ప్రాంత సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నాయి. పాలేపల్లికి చెందిన కానిస్టేబుల్ వెంకటయ్య నగరంలోని రాయదుర్గం పీఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని వస్తున్న క్రమంలో ఊటుపల్లికి చెందిన బీ దశరథ్‌కు చెందిన గేదెలు కారుకు అడ్డు రావడంతో ప్రమాదం జరిగింది. రెండు గేదెలు అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాయి. వాటి విలువ రూ. 1.5 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



ఆటోను సీజ్ చేసిన పోలీసులు

పెద్దేముల్: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. మంగళవారం పెద్దేముల్ గ్రామ శివారులో ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని ఎస్సై అన్వేష్ రెడ్డికి సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు దాడి చేసిన ఆటోని అందులోని 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఐస్‌క్రీం తయారీ కేంద్రాల్లో తనిఖీలు

- అనుమతి లేని రెండు కేంద్రాల మూసివేత
- ప్యాకెట్లపై ముద్రించని తయారీ తేదీ, ముగింపు గడువు
- షాపు మూసేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్
- తెరవాలని కమిషనర్ ఆదేశం
- ఇద్దరి మధ్య వాగ్వాదం



ఐస్‌క్రీం తయారీ కేంద్రానికి తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది



ఫ్రిజ్‌లో కాలం చెల్లిన ఐస్‌క్రీంలు

తాండూరు టౌన్: అనుమతి లేని రెండు ఐస్‌క్రీం తయారీ కేంద్రాలను తాండూరు మున్సిపల్ అధికారులు మూసివేశారు. మున్సిపల్ శాఖ నుంచి అనుమతి లేకుండా ఐస్‌క్రీంలు తయారు చేసి విక్రయిస్తున్నారని గుర్తించిన ఆ శాఖ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ తన సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం ఫ్యాక్టరీకి తాళాలు వేశారు. అయితే ఫ్యాక్టరీ మూసే అధికారం తమకు లేదని, వెంటనే తాళం చెవి యజమానికి ఇవ్వాలని కమిషనర్ శంకర్ సింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. ఇటీవల జిల్లాలోని పలు ఐస్‌క్రీం తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి సీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే టాస్క్‌ఫోర్స్ దాడి జరిగే వరకు సంబంధిత మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టకుండా ఏం చేస్తున్నారని కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో హడావుడిగా సోమవారం సాయంత్రం తాండూరు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ తన సిబ్బందితో కలిసి లారీ పార్కింగ్ సమీపంలోని నందిని, వేంకటేశ్వర కాలనీ సమీపంలోని తాజొద్దీన్ ఐస్ క్రీం తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. ఫ్యాక్టరీకి మున్సిపల్ అనుమతి లేకపోవడం, ప్యాకెట్లపై ఐస్‌క్రీం తయారీ, గడువు తేదీలు లేకపోవడంతో రెండు కేంద్రాలకు తాళాలు వేశారు.

కమిషనర్ వర్సెస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

అయితే ఓ ఫ్యాక్టరీ యజమాని డీలర్ నుంచి తెచ్చుకున్న అనుమతి పత్రాలను చూపించాడని, వెంటనే అతనికి తాళం చెవి ఇవ్వాలని కమిషనర్ శంకర్ సింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఐస్ క్రీం తయారు చేసేందుకు మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, తయారీ, ముగింపు గడువు తేదీలు లేవని, కావున తాను తాళం చెవి ఇచ్చేది లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెగేసి చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా, ఫ్యాక్టరీని మూసి వేసే అధికారం మాకు లేదని, ఒక ఫ్యాక్టరీ యజమాని డీలర్ నుంచి తీసుకున్న అనుమతి పత్రాలు ఉండటంతో అతనికి తాళం చెవి ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించానన్నారు.

మహనీయుల బాటలో నడవాలి

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- ఇప్పాయిపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

కుల్కచర్ల: మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని వారు చూపిన బాటలో యువత నడవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ఇప్పాయిపల్లిలో గౌడ సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బహుజన నేతల సేవలు భవిష్యత్ తెలియజేసేందుకు వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు రూ. 50వేలు, గౌడ సంఘ భవన నిర్మాణానికి రూ. 5లక్షలు కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి, కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

యథేచ్ఛగా అక్రమ దందాలు



ఇటీవల ధారూరు పోలీసులు సీజ్ చేసిన మట్టి ట్రాక్టర్లు

ధారూరు: అక్రమ దందాలకు ధారూరు మండలం అడ్డాగా మారింది. అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా మట్టి, ఇసుక, కలపను తరలించి జేబులు నింపుకుంటున్నారు. చీకటి పడింది మొదలు తెల్లవారుజాము వరకు అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల్లోని కొంత మంది సిబ్బందికి ముడుపులు చెల్లించి దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్లు, రోడ్లు, ప్రైవేటు కట్టడాలకు మట్టి, ఇసుక అవసరమైతే నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి పొంది తరలించాలి. కానీ అక్రమార్కులు ఇవేమీ పాటించకుండా రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ముడుపులు ఇవ్వని వారి వాహనాలను గుర్తించి సీజ్ చేస్తున్నారనే అపవాదు ఉంది. ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలానికి రూ. 5.77 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నారు. అయితే సగం ఇసుక, సగం డస్ట్ కలిపి రోడ్డు వేయాలి. కానీ రోడ్డు పనులు చేసే వారు నామమాత్రంగా ఇసుక వాడి మిగిలిన దాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏప్రిల్ 30న ధారూరు పోలీసులు రాత్రి తనిఖీలు చేపట్టి కేరెల్లి గ్రామ సమీపంలో ఏకంగా 5 మట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. ఇకనైనా అక్రమ వ్యాపారాలను అరికట్టి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చూడాలనీ పలువురు కోరుతున్నారు.

మట్టి తరలిస్తే చర్యలు

అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఈ నెల 30న పోలీసులు స్వాధీనం చేసుకున్న 5 మట్టి ట్రాక్టర్లకు రూ. 17వేల చొప్పున జరిమానా విధించాం. ఎక్కడైనా అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలి

– భువనేశ్వర్, తహసీల్దార్, ధారూరు

అదనపు బాధ్యతల నుంచి తొలగించండి

పంచాయతీ సీనియర్ కార్యదర్శుల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ సీనియర్ కార్యదర్శులు

బషీరాబాద్: జేపీఎస్‌ల సమ్మెతో ప్రభుత్వం పంచాయతీ సీనియర్ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల అదనపు బాధ్యతలను అప్పగించింది. గ్రామాల్లోని సమస్యలకు తాము సమాధానం చెప్పలేకపోతున్నామని.. అదనపు భారం మోయలేమని ఐదుగురు పంచాయతీ సీనియర్ కార్యదర్శులు ఎంపీడీఓ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమను వెంటనే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రవి, జయకర్, నర్సింహాగౌడ్, బాలరంగాచారి, యాదయ్య ఉన్నారు.

గృహిణి ఆత్మహత్య

మొయినాబాద్: భర్త వేధింపులు తాళలేక గృహిణి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా, రామచంద్రపురం మండలం తెల్లాపూర్‌కు చెందిన కే నవనీత(30)కు మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన కే అనిల్ కుమార్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అనిల్‌కుమార్ రోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. సోమవారం రాత్రి భార్యతో గొడవపడి ఆమెకు అక్రమ సంబంధం అంటగట్టి వేధించడంతో అవమానం భరించలేక అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు మరణంపై భర్త అనిల్‌కుమార్‌పై అనుమానం ఉందని మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గొల్లకుర్మలకు న్యాయం చేయండి

ఎస్పీని కలసి విన్నవించిన సంఘం నేతలు



పాండుపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కుర్మ సంఘం సభ్యులు

తాండూరు రూరల్: వ్యాపారం పేరుతో గొల్లకురుమలను మోసం చేసిన పెద్దేముల్ మండలం గోట్లపల్లికి చెందిన పాండు అలియాస్ కొండయ్యపై చర్యలు తీసుకోవాలని కురమ సంఘం నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు, తాండూరు జెడ్పీటీసీ జీ మంజుల, నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ జీ వెంకటేశం కోరారు. మంగళవారం వారు వికారాబాద్‌లో ఎస్పీ కోటిరెడ్డిని కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండయ్య తాండూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల గొర్రెల కాపరుల వద్ద మేకాలు, గొర్రెలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. అతనిపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయని తెలిపారు, దాదాపు రూ. 40లక్షల నుంచి రూ. 50లక్షల వరకు గొల్లకురుమలకు టోకరా వేశాడని పేర్కొన్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

గొల్లకురుమలను మోసం చేసిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాడనే సమాచారం ఉందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. పాండును పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తాండూరు డీఎస్పీ, సీఐ ఈ కేసు సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మేరకు భగీరథ నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మోమిన్‌పేటలో ఎంపీపీ డీ వసంతతో కలిసి మీతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. భగీరథ నీటిని తక్కువగా ఎందుకు సరఫరా చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. కొన్ని వార్డుల్లో తక్కువగా నీళ్లు వస్తున్నాయని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామంలో భగీరథ పైప్‌లైన్ పనులు ఎందుకు పూర్తి చేయలేదన్నారు. గ్రామంలో చాలా చోట్ల ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఇనుప స్తంభాలను వెంటనే తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పల్లె ప్రగతి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రామంలో పాడుబడిన ఇళ్లను తొలగించాలని ఆదేశించారు. సర్పంచ్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, మర్పల్లి వ్యవసాయ మార్కెటు కమిటీ చైర్మన్ శ్రీకాంత్ గౌడు, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీ వెంకట్, మాజీ సర్పంచ్ చంద్రయ్య, ఏఓ జయశంకర్, ఏఈఓ శంకర్, ఏపీఎం రాజు, ఆర్‌ఐ రాజు, నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మైపాల్ రెడ్డి, అంతయ్య, మాణయ్య, తిరుపతిరెడ్డి, సంగమేశ్వర్ గుప్తా, మల్లయ్య, మైబల్లి పాల్గొన్నారు.

పల్లె కళలను ప్రోత్సహిద్దాం

సినీ, షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ సురేష్‌రాజ్



కళాకారులతో బీఆర్‌ఎస్ నాయకులు

బొంరాస్‌పేట: పల్లెటూరి కళలను ప్రోత్సహిద్దామని సినీ, షార్ట్‌ఫిల్మ్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు బీ సురేష్‌రాజ్ అన్నారు. ఏప్రిల్ 24నుంచి దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో భక్త శిరియాల వీధి నాటకం ప్రదర్శిస్తున్నారు. ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. మంగళవారం కళాకారుల బృందానికి బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు రూ. 21వేలు నగదు అందజేశారు. కనుమరుగవుతున్న జానపద కళలను ఆదరించడం హర్షణీయమని సురేశ్‌రాజ్ పేర్కొన్నారు. పల్లె కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సాయం చేసిన బీఆర్‌ఎస్ నేతలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వాతి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటరాములు ముదిరాజ్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

సీఐ వెంకటేశం



మోమిన్‌పేట: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

మోమిన్‌పేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సీఐ వెంకటేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ ఉన్నారు.

అతివేగం ప్రమాదకరం

అనంతగిరి: అతివేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సీఐ టి.శ్రీను అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ పీఎస్‌లో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు.

నిబంధనలు పాటించాలి

మర్పల్లి: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని మర్పల్లి ఎస్‌ఐ అరుణ్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మర్పల్లి, మోమిన్‌పేట్ క్రాస్‌రోడ్డులో ఎస్ తన సిబ్బందితో కలిసి వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచిచారు.

‘ఆయుష్’తో వ్యాధులు నయం

డాక్టర్ గాయత్రి



ఆరోగ్య కరదీపికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గాయత్రి తదితరులు

దోమ: దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసేందుకు ఆయుష్ సేవలను వినియోగించుకోవాలని మండల ఆయుష్ వైద్యాధికారి గాయత్రి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాలెపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ.. ఆయుష్ వైద్యంతో అనారోగ్య సమస్యలు తలెత్తవని వివరించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూటతో వెళ్లి.. పోలీసులకు చిక్కి..

- మహిళను హత్య చేసి పడేసేందుకు వెళ్తుండగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కుషాల్కర్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్‌రూరల్: పసికందు కొనుగోలు వ్యవహారం ఓ మహిళ దారుణ హత్యకు దారి తీసింది. మృతదేహాన్ని మూటగట్టి గుట్టుగా ఊరుబయట పడవేసేందుకు వెళుతుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. కేసు వివరాలను ఏసీపీ కుషాల్కర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రాఘవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బద్లితండాకు చెందిన సబావత్ రాములు షాద్‌నగర్‌లోని పటేల్‌రోడ్డులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాములు, శారద దంపతులకు కూతురు ఉంది. అయితే తమకు కొడుకు లేడనే బెంగతో దంపతులు ఉన్నారు. కాగా, ఇదే కాలనీలో ఉంటున్న బిహార్ చెందిన పురుషోత్తం.. దేవకి(27) అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. పురుషోత్తంతో తనకున్న పరిచయం దృష్ట్యా తమ బాధను చెప్పుకున్నారు. దీంతో మగ పిల్లవాడు ఉన్నాడు కొనుక్కుంటారా అని పురుషోత్తం చెప్పడంతో విషయాన్ని రాములు తన భార్య శారద, మరదలు సాలమ్మ దృష్టికి తీసుకెళ్లాడు. చివరకు బాలుడిని కొనుగోలుకు అంగీకారం కుదిరింది.

లక్షన్నరకు కుదిరిన ఒప్పందం

ఐదు నెలల క్రితం దేవకి, పురుషోత్తం కలిసి బాలుడిని రాములుకు రూ. 1.5 లక్షలకు విక్రయించారు. తర్వాత పురుషోత్తం కనిపించకుండా వెళ్లిపోయాడు. కొంత కాలం తరువాత దేవకి వచ్చి తనకు డబ్బులు కావాలని అడగడంతో ఇచ్చారు. ఇదే క్రమంలో డబ్బుల కోసం రాములు శారద దంపతులను వేధించసాగింది. డబ్బులు ఇవ్వకపోతే నా పిల్లాడిని నేను తీసుకువెళతానని చెప్పడంతో విసుగు చెందిన రాములు.. దేవకిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల ఒకటో తేదీన రాత్రి సమయంలో దేవకి.. రాములు ఇంటికొచ్చి మళ్లీ గొడవకు దిగింది. రాములు దంపతులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో అందరూ కలసి దేవకి గొంతు నులిమి హత్య చేశారు.

మూట తీసుకెళ్తుండగా..

అర్ధరాత్రి సమయంలో ఎవరికి తెలియకుండా దేవకి మృతదేహంతో ఉన్న మూటను రాములు ఎత్తుకొని పటేల్ రోడ్డు నుంచి బుచ్చిగూడ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు రఫీ, భూపాల్‌రెడ్డిలకు అనుమానం రావడంతో మూట విప్పి చూశారు. సంచిలో మహిళ మృతదేహం కనిపించడంతో కంగుతిన్నారు. దీంతో వెంటనే రాములును అదుపులోకి తీసుకొని విచారించగా..నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో నిందితులు రాములు, శారద, జ్యోతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితులు రాములు, శారద, జ్యోతి

సీపీ చేతుల మీదుగా రివార్డులు

సమయ స్ఫూర్తితో వ్యవహించిన పెట్రోలింగ్ పోలీసులు రఫీ, భూపాల్‌రెడ్డిలను సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డీసీపీ నారాయణరెడ్డి అభినందించి రివార్డులను అందజేశారు.